


నాగరికత వాడి విసరేసిన దుర్గంధ భూయిష్టమయిన వస్తువులు పడున్న పెంటకుప్పమీద, నాగరికతా లోకం వాడి విసరేసిన ఆడది, చేత మూరడు పొడుగున్న కర్రముక్కతో పెంటకుప్పని కెలికి వెతుకుతోంది దృష్టినంతా లగ్నం చేసి

ఆమె కట్టున్నది చీర కాదు. ఏనాడో కాలం తనతో పాటు తీసుకుపోయిన అందాలనీ, వంపుసొంపులనీ, మచ్చుకయినా చూపరులకు గుర్తుకుతేని ఆ ఒంటిని చుట్టిపెట్టే ఆరుమూరల పొడుగూ, రెండు మూరల వెడల్పూ ఉన్న ఒక గుడ్డపేలిక.

**1979 చక్రపాణి కన్సొలేషన్ అవార్డు పొందిన కథ**

నగ్నంగా వీధిలోకి నగ్ననాగరికత రానివ్వదు కాబట్టి ఆ మరుగు పెట్టుకోవలసి వచ్చింది.

వీధిలోకి రానిదే జానెడు పొట్ట నిండదు కాబట్టి వీధిలోకి రావలసి వచ్చింది.

ఆ చీరకావి చీరకూడా ఆమె బతుకులానే అలనాడు తెలుపు, తరవాత నిండా డాగులతో మట్టిరంగు, ఇప్పుడు చిరుగులూ అతుకులతో నలుపు రంగు.

ఆ ఒంటిపొర చీరలోంచి మానవ స్త్రీజీవి శరీరంలోని భాగాలన్నీ సూర్యుడి ప్రచండమైన కాంతిలో చూడాలనుకుంటే ప్రేక్షకులకి కనిపిస్తున్నాయి కాని ఏ ప్రేక్షకుడూ చూడాలనుకోడం లేదు.

వాడి విసరేసిన వస్తువులనీ, వాడి నలిగిన పూలవంటి స్త్రీలనీ ఎవరు గమనిస్తారు? గమనించదలచుకున్నా గమనించడానికి ఏమీ లేవు. ఆమెని ఏ కాళిదాసూ, భవభూతీ, పెద్దనా, శ్రీనాథుడూ ప్రబంధనాయికగా ఎంపిక జేసుకోరు. ఆమెని ఏ ఆధునిక రచయిత్రీ రచయితా తమ పాఠకులని ఉర్రూతలూగించే ప్రేమ, కామ, భ్రమ లోకాలలో విహరింపజేసే నవలా రాజులకి రాణులగా ఎంపిక చేసుకోరు. అటువంటి స్త్రీని ఏ హీరోతోనూ ప్రేమలో పడనివ్వరు. ఆమెని ఆఖరికి సత్యజిత్ రాయి, మృణాల్ సేన్లు కూడా తమ ఖండాంతర, అఖండ చిత్రాలలో కనీసం ఎక్స్ట్రాగానన్నా తీసుకోరు.


ఏనాడూ తైలసంస్కారం లేక ఏనాడూ దువ్వెన పళ్లకాట్లకి నోచుకోక, ప్రతి వెంట్రుకా సన్నపాటి రాగితీగ ఎంటీనాలా తలమీద నిల్చుంది. ఆ కేశ సంపద అనబడే చిట్టడవిలో ఎన్నో క్రిమికీటకాలు స్థావరం ఏర్పరచుకొని తమ వంశాలని విస్తరింపజేసేయి. కుండపోతగా పడ్డ వర్షంలో ఆమె ఎప్పుడన్నా నిలబడినా ఆ గంగాదేవి ఆ వెంట్రుకలని తాకడానికి భయపడి, తడపకుండా జారుకుంటుంది.

ఆమె ముఖం ఫలానాలా ఉంటుందని వర్ణించడం ఎవరికీ తరంకాదు. ఎన్నిసార్లు చూసినా వెనువెంటనే ఆ ముఖాన్ని మరిచిపోవడం జరుగుతుంది. ఆ ముఖమండలం గమనించగా చంద్రమండలం గుర్తుకు రాదు. కలువరేకు లంతకన్న కనిపించవు. దొండపళ్లు, సంపెంగ పూలూ ఉన్నాయనే మరిచిపోవడం జరుగుతుంది. చక్రవాకం పక్షులూ, అరటి బోదెలూ, తామర తూళ్లూ, ఇవేవీ దరిదాపులకి చేరవు.

మరి ఆమె అడది కాదా? అడదాని అందాన్ని వర్ణించడానికి ఉపమానాలు కరువయ్యేయా?

ఆమె అడదే. కాని కవులకు, రసికులకు, రచయి(త్రు)తలకు, సరసులకు, విరసులకు, రాజులకు, భోగులకు కావల్సిన అందాలు ఆమెలో లేవు.

ఆమె అడదేనని ఒకరికి మాత్రం




తెలుసు. ఆమె వీపుకి వ్రేలాడుతున్న బిడ్డకు! ఔను. ఆమె మెడమీంచి తిప్పి, భుజాల క్రిందనించి వీపుకి వ్రేలాడేలా ఓ రెండుమూరల గుడ్డపేలికతో కట్టిన జోలిలో ఏడాది వయసు పసికూన వ్రేలాడుతోంది.

ఆ బిడ్డ ఉండుండి, చీకేసిన మామిడి పండు చర్మంలా వ్రేలాడిపోయిన ఆమె పాలిండ్లలో లేని పాలని జుర్రుకుందుకు ప్రయత్నిస్తోంది. ఆమె చనుకట్టును జూసి ఆ అంగసౌందర్యం గాంచి ఏ రసికుడూ కాముడి బారిని పడడు. వెలపరంతో పాపం వాంతిచేసుకుంటాడు. ఏ కవి కింకరుడూ వర్ణింప సాహసించడు. అతడి కావ్యకన్యక సిగ్గుతో తలదించుకుంటుంది. కవితాభావన మూగవోతుంది కవి హృదయం చస్తుంది.

కాని....చంకలోని బిడ్డకి ఆ రెండు స్తనాలూ, జీవాన్నిచ్చే సంజీవినీ పర్వతాలే....సజీవ మానవకాంత పొదుగులే.

పలచగా ఉన్న, చిరుగులుపడ్డ ఆ చీరలోంచి ఆ స్త్రీమూర్తియొక్క తొడలు కనిపిస్తున్నాయి. జఘనాలు అగపడుతున్నాయి. నడుము నాభి, కటి ప్రదేశం అంతా గోప్యం అంటూ లేక దర్శనమిస్తున్నాయి

కాని, ఇటువంటి చీరనే సినీప్రేక్షకుల అందాల అభిమాన కలల సుందరికి కట్టిపెట్టి, ఆమెను దర్శకుడు ఇటువంటి పెంటకుప్ప ఎక్కించి, పంచరంగుల ఛాయాగ్రహణంతో, సినిమాన్కోపిస్తే, ఓ సోలోగీతం పాడిస్తూ....ఆ సీను చూడ్డానికి ప్రేక్షకులు బాక్సాఫీసుని ఎన్ని వందలసార్లన్నా ముక్కలు చెయ్యరా?

అమెని విలన్లు రేపిస్తా మంటూ వెంటబడగా హీరోలు విలన్లని చిత్తుజేసి అమెని రక్షించి ప్రేమిస్తామంటూ గీతాలాపన జేస్తూ దూసుకరారా ?

కాని....ఇక్కడ పట్నం నడిరోడ్డు మీద నాగరికతా లోకం వాడి విసరేసిన వస్తుసముదాయపు చెత్తల కొండమీద, తీవ్రమైన ఎండలో చెమటలు కారుతూ, వీపుమీద బిడ్డభారంతో, కడుపులో జఠర రసం చేసే మంటల బాధతో, బిడ్డడి పాల దాహం తీర్చ లేక పోతోం దన్న మమకారపు మానసిక వేదనతో నిలబడ్డ ఈ స్త్రీ శరీరమంతా నగ్నంగా అగుపడుతున్నా, అది నగ్నస్త్రీ శరీరమని ఏ ప్రేక్షకుడి మనసుకీ తట్టడంలేదు. లంగా, బ్రాసరీ, వాటిమీద చీరా, రవికా తొడుక్కున్నా కాలేజీ అమ్మాయిలని ఎక్స్‌రే కళ్ళతో చూడగలిగే సత్తా ఉన్న రోమియోల కళ్ళు, ఒంటిపొర గుడ్డపీలిక కట్టుకున్నా, ఈ స్త్రీని ఎక్స్‌రే తియ్యలేకపోతున్నాయి.

అమె ఒంటిమీది, బిడ్డ ఒంటిమీది చర్మం ఏనాడూ సబ్బునురగని కాని, నురగనీటిని కాని, నీటి శుభ్రత కాని, శుభ్రత తాకిడిని కాని ఎరుగదు. ఎండకి ఎండింది. వానకి తడిసింది. చలికి వణికింది. వేడికి మాడింది. మాడు రంగులో మిగిలింది.

ఇప్పుడా ఒంటిని వేడి కాల్చలేదు. చలి వణికించ జాలదు. వర్షం తడపలేదు.

ఏ క్రిమికీటకం, ఎంత భయంకరమైనదైనా ఆమె శరీరాన్ని ఆశ్రయించబూనుకుంటే వాటికి ఆయువు మూడుతుంది.

ఆమె శరీరంలో రక్తం ఏమాత్రమన్నా మిగిలి ఉంటే (ఇప్పుడు బొమికలూ, చర్మం తప్ప మరేమీ లేవు) ఆ రక్తాన్ని సర్వరోగనివారణకి 'వేక్సీన్'గా అధునిక ఔషధ నిపుణులు వాడేసి ఉందురు. ఆ రక్తాన్ని 'వేక్సీన్'గా నాగరికులకి ఎక్కిస్తే అమ్మతల్లి హడలుకొట్టుకుని అయిపులేకుండా పోతుంది. నూకాలమ్మ నురగలు కక్కుకుంటూ చస్తుంది. అసిరమ్మ ఉరెట్టుకుంటుంది.

మలేరియా, పైలేరియా, ఎలిఫెంటైసిస్ దోమలు ఆమె దేహాన్నీ, ఆ బిడ్డ దేహాన్నీ కుట్టికుట్టి మరి కుట్టలేక కుంటుపడ్డాయి.

కలరా క్రిములు వారి శరీరంలోకి ఎక్కి ఎక్కి మరి చోటులేక, విలవ నీడలేక బజారు పాలయ్యేయి.

స్మాల్‌పాక్స్, చికెన్ పాక్స్, టైఫాయిడ్, వైరస్, బాక్టీరియా క్రిములు అమె శరీరమూ, అమె బిడ్డ శరీరమూ అనే దుర్గాలని ముట్టడించి, మెరుపు దాడులు జరిపి, సమరంలో ఓడిపోయి సాలలేక తలవంచుక అపజయాన్ని స్వీకరించేయి.

అమెని అంటే శక్తి కలిగినది ఒకే

క్షుధ

ఒక్కరోగం. ఆకలి రోగం. ఆ రోగం ఆమెని మాడ్చి మాడ్చి, చర్మము ఎముకల పోగుగా మిగిల్చింది. అలా ఎముకల పోగుగానన్నా మిగులుదామని ఆమె ప్రయత్నం. అందుకోసం పట్నం లోని పెంటకుప్పలని కెలకడం మూరెడు కర్రతో.

ఎవడో అనామక పురుషుడు, ఏ చీకటి రాత్రో, నాటుసారా నిషాలో, రోడ్డు సైడుకాలువ పక్కని పడుకున్న ఆమె ఒంటిని ఆడఒంటిగా గ్రహించి, తన ఒంటికి పుట్టిన క్షణిక కామాన్ని, పనికి రాని వస్తువని పెంటకుప్పమీద పారేసి నట్టు ఆమె మీద పారేసి, పైసా ఖర్చు లేకుండా వేడిని తగ్గించుకోగా, ఆడ శరీరం తన ప్రకృతి ధర్మాన్ని తాను నిర్వహించింది. క్షేత్రం, బీజం, మొలక!

మొలకవంటి బిడ్డ, నీరులేని నారులా వాడిపోయి ఒక ప్రక్కని భుజానికి జోలిలో వ్రేలాడుతూ ఉండగా రెండవ భుజానికి వ్రేలాడుతోంది మరో జోలి. ఆ రెండవ జోలిలోకి ఆమె పెంటకుప్ప మీది చిత్తుకాగితాలు, పనికిరాని టిన్నులు, అరిగిపోగా పారేయబడ్డ చెప్పులు, కలవారి పిల్లకాయలు ఆడి ఆడి, పీకి పీకి విసిరేసిన బొమ్మలు, సగం తిని పారేసిన ఎండు గోధుమ రొట్టెలు, నాగరికులు ఒకప్పుడు విలువనిచ్చి కొనుక్కొని, ఇప్పుడు ఏ విలువా ఇవ్వక చెత్తల పర్వతం మీద పారేసిన వస్తువులకి ఆమె విలువనిచ్చి వాటిని అమూల్య పదార్థాలగా ఏరి జోలిలో వేసుకుంటోంది.

చంకలోని పిల్ల గీపెట్టి ఏడుపు లంఘించుకుంది. దాహం వేసిందో, ఆకలే అయిందో.... లేక తోలుతిత్తి వంటి తల్లి రొమ్ములు పట్టుకొని ఎంత చీకినా పాలు రాలలేదని కోపం వచ్చో... కేరుకేరు మంది.

బిడ్డయొక్క ఆ ఏడుపుని తల్లి లెఖ్కచెయ్యలేదు. ప్రాణం ఉన్న న్నాళ్లు తన బిడ్డ ఏడవక తప్పదనీ, ఏడవక మానదనీ, ఏడవకపోతే ఈ లోకం ఏడిపించక మానదని ఆమెకి తెలుసు.

'ఏడవ్వే బిడ్డా! ఇంకా వెక్కి వెక్కి ఏడువు! ఈ ఏడుపు ఇప్పట్నించీ నీకు అలవాటవడం మంచిది!' అన్న ధోరణిలో ఊరుకుంది.

ఆ స్త్రీతోబాటు పెంటకుప్పని ఎముక ముక్కలకోసం వెతుకుతున్న ఊరకుక్క, చంటిదాని ఏడుపువిని, తనని పలకరిస్తోం దనుకొని, తోక జోరుగా ఆడిస్తూ దగ్గరకు చేరింది.

బిడ్డను ఊరుకోపెడదామని తల్లి, "ఊరుకోయే! యిదిగో సూడు.... ఊరకుక్క!" అంటూ కుక్కని చూపగానే, కుక్కని ఆటవస్తువుగా భావించి బిడ్డ ఏడుపు ఆపి చిరునవ్వు నవ్వింది. కుక్కవేపు చేతులు జాపింది.

జోలిలోంచి పోతానంటూ మారాం చేసింది.

ఇంకా పెంటకుప్పని వెతికి అమూల్య పదార్థాలని వెలికిదీసే పని ఎంతో ఉండటం వల్ల కాస్సేపన్నా బరువు తగ్గుతుందని జోలిలోని బిడ్డను తీసి పెంటకుప్పమీద కుదేసింది తల్లి

ఆ ఏడాది పసికూన నగ్నంగా ఉంది.

ఆ బిడ్డ మొలకు తాడుకాని, మెడలో రాగిబిళ్లైనా కాని లేవు.

నవమాసాలూ మోసి ఆ తల్లి కన్నదేకాని, ఆరు నెలలకే పుట్టేసిన పాపలా, ఈనపుల్లల వంటి కాళ్ళు చేతులూ, అనపకుండ వంటి కడుపుతో, సజీవ మానవపిండంలా ఉంది, పెంట కుప్పమీది బాల.

పిల్లని చూడగానే, అది మానవ బాల అని గ్రహించి, మానవుల మీద ఇంకా విశ్వాసం పోని కుక్క దగ్గరగా వెళ్లి, వాసన జూసి, తృప్తిపడ్డట్టు తోకాడించి, ఒంటిని ప్రేమగా నాకి ఆ ఒంటికున్న మురికిని శుభ్రం చేయ సాగింది.

మానవ బాల, కుక్కని చూసి కేరుతూ నవ్వింది.

పెంటకుప్ప కెలుకుతున్న ఎండి పోయిన ఆ మానవ రూపానికి దరిద్రుడికి నిధి దొరికినట్టు దొరికింది ఒక ఎండు గోధుమ రొట్టెముక్క.

నిన్నరాత్రి పిల్లలు సగం కొరికి వదిలేసిన ఎంగిలి రొట్టెలని పనిమనిషికి వెయ్యలేక, పెంటకుప్పమీద ఎదురింటి అన్నపూర్ణదేవి పారేయగా, ఆ రొట్టె ముక్క రాత్రల్లా గాలిబారి, ఇప్పటివరకూ ఎండ కెండి, ఎర్రగా మార్చిన మినప రొట్టె పొరుకులా రూపం ధరించింది।

ఎంతో సంబరపడుతూ "ఓలె మానచ్చిమీ। యింద రొట్టెముక్క।" అంటూ, పెంటకుప్పమీద, జాగిలంతో నేస్తం కడుతున్న మహాలక్ష్మికి ప్రతి రూపం కాని మానవ బాలికకి అందించింది రొట్టెముక్క అ తల్లి.

అందించేక తన అన్వేషణలో తాను పడింది.

బిడ్డ రొట్టెముక్కను ఆనందంగా పిడికిలి బిగించి పట్టుకుంది. అది ఆహారమని ఆ బాలకి తెలుసు.

ఆ సంగతి నేస్తమయిన కుక్కకీ తెలుసు.


పిల్లమీద కలబడి, చేతిలోని రొట్టె మూతితో కరచుక లాగింది కుక్క.

కెవ్వున ఏడ్చింది మాలచ్చిమి.

పెంటకుప్పని కర్రతో కెలుకుతున్న ఆడది, ఆ కర్రతోనే కుక్కని ఓ దెబ్బ కొట్టి కుక్కనోట్లోంచి ఎండు రొట్టెను లాగి పిల్లకివ్వగా, పిల్లి పెదవులమీద చిరునవ్వు తిరిగి వాలింది.

మాలచ్చిమి, ఆ రొట్టెను ఆప్యా యంగా నోటపెట్టుకొని, ముందుగా

మీరంతా సుఖ పడాలనే గదా అడుంపా దుడుంపా ఎలక్షన్లు రావడం! ఇదుగో యీ యాభై భద్రంగా దాచు!! మన పార్టీని మరిచి పోకు!!



మొలచిన ముందు పళ్ళతో కొరకడం ఆరంభించింది.

కుక్క అశ పోక, ఓ అడుగు దూరాన కూర్చుంది, రొట్టె జారిపడదా అని, నాలిక పైకిజాపి లాలాజలం కారుస్తూ, తోక అప్పుడప్పుడు ఆడిస్తూ.

ఓ మానవ శిశువు ఏమిటో తినేస్తోంది.... క్రిందనేమన్నా రాల్చదా అన్న ఊహతో రెండు కాకులు ఓ ధనవంతుడి మేడపైన పడిగాపులు పడుతూ, ఏమీ తినడానికి దొరకక నిరాశ చెందినవి, వచ్చి ఈ బీదదాని పక్కని వాలేయి. మూతులు ఇలా అలా తిప్పి ఒంటికన్నుతో పరిశీలించేయి తమ పొరపడలేదుకదా అని. లేదు, పొరపడలేదు. ధైర్యంగా గెంతులేస్తూ మరింత చేరువకి చేరుకున్నాయి.

కాకులని చూడగానే ఆ ఏడాది కూన మహా సంబర పడింది. ఆనందంలో కేరుతూ చేతులూపగా చేతిలోని ఎండు రొట్టె నేలమీద పడింది.

ఈ అదునుకోసమనే ధనవంతుడి సౌధంమీంచి, బీదపిల్ల దారిద్రం మధ్యకి వాలిన రెండు కాకులలోనూ ఒక కాకి, 'కావ్' మని అరిచి రొట్టెను ముక్కుతో పొడిచి పట్టుకొని, రెండోకాకి వెంటరాగా మళ్లా కలిగిఉన్నవాడి కోఠమీదికి ఎగిరి పోయింది।

చేతిలోని తిండిని కాకి తన్నుకపోగానే పిల్ల కెవ్వుమని ఏడ్చింది.

పెంటకుప్పలోని మణి మాణిక్యాలని వెతకడంలో నిమగ్నురాలయిన తల్లి తలఎత్తి ఏం జరిగిందో గమనించింది. పట్టరాని కోపం పిల్లమీద

వచ్చింది. దీనివి కన్నది కాబట్టి తిండి పెట్టవల్సిన బాధ్యత తనది. ఆ తిండి సంపాదించడం ఎంత కష్టమో ఆమెకు తెలుసు. మోసాలు చేయడం ఆమెకు చేతకాదు. బుర్రలు కొట్టడం చేతకాదు. కూలినాలి ఇచ్చేవారెవరూ లేరు. ఒళ్ళు అమ్ముకుందామంటే ఈ శరీరంలో మిగిలిందేమిటి? రోడ్ల మీదా, బస్ట్టేండ్ల దగ్గరా ముష్టి ఎత్తుకోవచ్చు.... కానీ ఆ పనీ ఆమె కిష్టంలేదు. కుష్టురోగులలో ఒకరిగా మారడం ప్రాణం పోయినా తను చెయ్యలేని పని.

అందుకు ఈ పెంటకుప్పలు కెలికి, ఖాళీ టిన్నులు, పాత కాగితాలు, పగలని గాజుసీసాలు మొదలైన సామానులు వెతికి తీసి, సంచి నింపితే వీటి నన్నింటినీ కొనడానికో సాయిబున్నాడు. అదృష్టం బట్టి రోజుకీ యాభై పైసల నించి రూపాయివరకూ దొరుకుతుంది. ఒకోనాడు ఏమీ దొరకదు. దీనికి బోలెడంత పోటీ .... వందల కొద్దీ మనుషులు.

ఈ పిల్లకోసం మరో రొట్టెముక్క సంపాదించడమంటే ఎంత కష్టమో ఆ తల్లికి తెలుసు. ఇదీ తనలానే పనికి రానిదీ, తెలివిలేనిదిలా ఉంది। హుత్ అంటే ఎగిరిపోయే కాకి దీన్ని మోసం జేసిందే.

కోపం పట్టలేక ఫెడీల్మని బిడ్డ వీపుమీద ఒక దరువు వేల్చింది తల్లి.

రొట్టి పోయిందని ఏడుస్తూ ఉంటే తనమీద ప్రేమానురాగాలు కురిపించి, ఓదార్చి, మరో రొట్టె ఇవ్వవలసిన తల్లి కోపంతో కొట్టడంవల్ల ఆ పసిపాప ద్విగుణీకృతమైన శోకంతో, రోషంతో కంఠ్యమవి స్థాయి ఎక్కువజేసి ఏడుపు లంఘించుకుంది.

అ ఏడుపు తీవ్రతకి కుక్క భయపడి, తోకముడిచి దూరంగా పోయింది.

ధనవంతుడి మేడమీద కూచొని, ఈ బీదదాని రొట్టెని మేస్తున్న రెండు కాకులూ, ఆ తల్లి, దేవుడ్నడిగి రెక్కలు తెచ్చుకొని తాము దొంగిలాడిన రొట్టి ముక్కని ఎక్కడ ఎగరేసుకు పోతుందోనని భయపడి దూరంగా నున్న ఓ కోటీశ్వరుడి అరంతస్థుల భవనం మీదకి పోయేయి. కాపలాగా ఉన్న గూర్ఖా ఈ ముష్టి మనుష్యులని చుట్టుపక్కలకు రానివ్వడని ఆ కాకులకి తెలుసు.

తల్లి తనని కొట్టిందన్న కోపంతో పిల్ల క్షణక్షణానికీ ఏడుపు ఎక్కువ చేసింది. ఏడుపు వల్ల చీమిడి పట్టిన ఆమె ముక్కుమీదకి జుమ్మని ఓ ఈగల గుంపు దండయాత్ర ప్రారంభించింది. కన్నీటితో చారలు కట్టిన ఆ పాప కళ్ళ చుట్టూ దోమలు పోగయ్యేయి.

పెంటకుప్పలోని ఓ ఎర్రచీమకి పిల్లని మరింత ఏడిపిద్దామని బుద్ధిపుట్టి చిటుక్కున కుట్టింది.

ధూమ్యాకాశాలు మారు[మోగేటట్టు ఏడుస్తోంది పసిపాప లచ్చిమి.

ఆ ఏడుపు రోడ్డుమీద పెరిగిన రద్దీతో కలిసిపోయింది.

కారులు ఎడతెరిపి లేకుండా బాబులనీ, అమ్మలనీ తీసుక ఎక్కడికో పోతున్నాయి. బస్సులు నాగరికులని మొయ్యలేక మొయ్యలేక మోస్తూ వారిని వారి లోకానికి ఈడ్చుకపోతున్నాయి.

నవీన నాగరికత నిముషం నాగా లేకుండా వర్ధిల్లుతోంది.

పెంటకుప్ప, నాగరికతా చిహ్నంగా గుట్టనించి కొండగా పెరుగుతోంది.

పెంటకుప్పల మీద బతికే మనుషులు, పెంటకుప్ప శిఖరాలని అందుకునేందుకు [ప్రయత్నిస్తూ, అందుకోలేక అక్కడే చతికిలబడి, అక్కడే పిల్లల్ని కని, సంసారాలని చేసేస్తున్నారు.

నాగరికుల కోసం నాగరికతా [ప్రభుత్వం ఏర్పడి, కోట్లు వసూలుజేసి, కోట్లు వారికోసం ఖర్చుచేస్తే. పెంట కుప్ప మనుష్యులకోసం, పెంటకుప్ప [ప్రభుత్వం ఉంది, కుక్కలూ, కాకులూ, చీమలూ, దోమలూ, ఈగలూ, మురికి, దుర్గంధం, భయంకరమైన [క్రిమికీటకాలు మురికి, దుర్గంధం, ఎండ, వాన, చలి రూపాన: ఇవన్నీ [ప్రభుత్వపు అంగాలు.

ఈ పెంటకుప్పల [ప్రపంచంలో పౌరురాలయిన ఆ తల్లి, పిల్ల వీపుమీద రెచ్చిపోయిన కోపంతో ఫెడీ, ఫెడీమని మరో రెండు దెబ్బలు వేసి పిల్ల ఏడుపు కన్న తనగొంతు ఎక్కువజేసి కీచుగా అరిచింది. "నీయమ్మ కడుపు కాల: ఊరుకోయే: దరి[ద్రకొట్టు మొకమా: పల్లకోయే:"

కడుపు కాలుతూఉండడం వల్లే ఏడుస్తున్న బాలిక ఏడుపు ఆపలేదు సరి కదా మరింత ఎక్కువ చేసింది.

అరుస్తూ....తల్లి ఏడుస్తూ బిడ్డ....

ఆ ఆకలి ఏడుపుని ఎలా ఆపడమో తెలీని ఆ తల్లి, మాతృ[పేమ అడ్డు రావడంవల్ల ఆ పసికందుని పీక పిసికి చంపేసి ఆ పెంటకుప్పమీద కుక్కలకి ఆహారంగా పడేలేక, (ఆ ఒక్కపని వల్లనే ఆ ఏడుపు కడుతుందని ఆమెకు తెలుసు) దిక్కుతోచక, దిక్కులు చూస్తూ, దీనంగా పెంటకుప్పమీద నిలబడిపోయింది —

ఏడిస్తూనే ఉంది బాల మరింత ఉద్వేగంతో:....దోమలు ఆ కన్నీటిని పీలుస్తున్నాయి.: ఈగలు ఆమె చెక్కిలి కొరుకుతున్నాయి: చీమలు కుట్టి కుట్టి ఆమె రక్తంకోసం ఉవ్విళ్లూరుతున్నాయి. కుక్క మరో వీధికి పోయింది: కాకులు లోకులతో కలిసిపోయేయి:

(అంకితం : అంతర్జాతీయ బాలల సంవత్సరంలో తెలుగు బాలకి.)